సాక్షి
అనంతపురం
మంగళవారం । 20 । జూన్ । 2023



చీనీ టన్ను రూ.40 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.40 వేలు పలికాయి.



ఫెర్రర్ జీవితం ఆదర్శప్రాయం

పేదల అభ్యున్నతికి కృషి చేసిన ఆర్డీటీ వ్యవస్థాపకుడు విన్సెంట్ ఫెర్రర్ జీవితం ఆదర్శప్రాయమని వక్తలు పేర్కొన్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
39.2°/24.4°

జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. మధ్యాహ్నం వరకు ఉక్కపోత అధికంగా ఉంది.

న్యూస్‌రీల్

'పోలీసు స్పందన'కు 132 వినతులు



సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'స్పందన'లో ప్రజల నుంచి వివిధ సమస్యలపై 132 వినతులు అందాయి. ఎస్పీ శ్రీనివాసరావు వినతులు స్వీకరించి అర్జీదారులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్ విజయభాస్కర్‌రెడ్డి, జీ రామకృష్ణ, ఎస్బీ సీఐ ఇందిర, టెక్నికల్ విభాగం ఎస్ఐ సుధాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదరణ చిట్స్‌పై విచారణకు ఆదేశం

అనంతపురం అగ్రికల్చర్: నగరంలోని ఆదరణ చిట్ ఫండ్స్ ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులపై విచారణకు ఆదేశించినట్లు జిల్లా సహకార అధికారి (డీసీవో) ప్రభాకర్‌రెడ్డి సోమవారం 'సాక్షి'కి తెలిపారు. మ్యూచువలీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ (మ్యాక్స్) కింద చిట్‌ఫండ్స్ వ్యవహారాలు నిర్వహిస్తున్న ఆదరణ సంస్థపై ఇటీవల ఆరోపణలు వెల్లువెత్తడంతో సహకారశాఖ రంగంలోకి దిగినట్లు చెప్పారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ గంగాధర్, సీనియర్ ఇన్‌స్పెక్టర్లు శివకుమార్, మల్లికార్జునను విచారణాధికారులుగా నియమించినట్లు తెలిపారు. వారంలోపు నివేదిక సమర్పించాలని సూచించామన్నారు.

ఇంజిన్ నుంచి విడిపోయిన వ్యాగన్లు



వ్యాగన్లను పరిశీలిస్తున్న స్థానికులు

రాయదుర్గం: బెంగళూరు నుంచి బళ్లారి వైపు బొగ్గు లోడుతో సోమవారం వెళుతున్న గూడ్సు రైలు డి.హీరేహాళ్ మండలం కల్యం గ్రామ సమీపంలోకి చేరుకోగానే ఇంజిన్ నుంచి 46 వ్యాగన్లు విడిపోయాయి. కేవలం ఐదు వ్యాగన్లతో ఇంజిన్ ముందుకెళ్లిపోయింది. విడిపోయిన 46 వ్యాగన్లు కిలోమీటర్ దూరం వెళ్లి ఆగిపోయాయి. వెనుక వ్యాగన్‌లో ఉన్న గార్డ్ నుంచి సెట్ ద్వారా సమాచారం అందుకున్న లోకో పైలెట్లు కొత్తూరు గేటు నుంచి వెనక్కు వచ్చి విడిపోయిన వ్యాగన్లను కలిపి ముందుకెళ్లారు.

వైద్య, ఆరోగ్య శాఖలో సజావుగాబదిలీలు

అనంతపురం క్రైం: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి అధ్యక్షతన సోమవారం వివిధ కేడర్ల బదిలీలు సజావుగా జరిగాయి. సీనియారిటీ ప్రాతిపదికన జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్లు, తోటి, ఫ్యామిలీ వెల్ఫేర్ వర్కర్లను బదిలీ చేశారు. కార్యక్రమంలో పీసీపీఎన్డీటీ యాక్ట్ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్ పాల్గొన్నారు.

'సేవామిత్ర'లకు అవార్డుల ప్రదానం



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న సేవామిత్రలు

అనంతపురం అర్బన్: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న 'సేవామిత్ర'లకు ఉత్తమ సేవా అవార్డులను సోమవారం కలెక్టర్ గౌతమి ప్రదానం చేశారు. కలెక్టరేట్ రెవెన్యూభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇద్దరు సేవామిత్రలు అవార్డులు అందుకున్నారు. వీరిలో లైఫ్‌లైన్ ఆస్పత్రి సేవామిత్ర ప్రసన్నలక్ష్మి కులశేఖర్, బేబీ ఆస్పత్రి సేవామిత్ర ఎస్.స్వాతి ఉన్నారు. ప్రశంసాపత్రంతో పాటు రూ.5వేల ప్రోత్సాహకాన్ని అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీలో ఇష్టారాజ్యం



- అర్హత లేని కాంట్రాక్టరుకు రూ.4.64 కోట్ల పనులు
- కొన్ని చోట్ల సింగిల్ టెండరుకే పనుల అప్పగింత
- టీడీపీ నేత జయప్పకు జీహుజూర్
- వేరే కాంట్రాక్ట్ సంస్థ పేరుతో టెండరు కట్టబెట్టిన వైనం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రోడ్లు, భవనాల శాఖ (ఆర్‌అండ్‌బీ)లో ఇష్టారాజ్యం నడుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా పనులు అప్పగిస్తున్నారు. ఈ శాఖ పరిధిలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో రూ.100 కోట్లకు పైగా విలువైన పనులు జరుగుతున్నాయి. ఇంత పెద్దఎత్తున పనులు చేపడుతున్నప్పుడు అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలి. కానీ విచ్చలవిడిగా టెండర్లు కట్టబెడుతున్నట్లు విమర్శలొస్తున్నాయి. అలాగే కాంట్రాక్టర్లు కమీషన్లు ఇవ్వనిదే బిల్లులు చేయని దుస్థితి నెలకొంది. ఇదేమని అడిగితే పనుల్లో కొర్రీలు వేసి తిప్పుకుంటున్నారు. కొన్నిచోట్ల కాంట్రాక్టర్లకు ఆయాచిత లబ్ధి కలిగేలా ఎస్టిమేషన్లు పెంచుతున్నట్టు తేలింది.

అర్హత లేకున్నా పనులు

ఒక రోడ్డు పని అప్పజెప్పాలంటే టెండరు నోటిఫికేషన్ ఇవ్వాలి. తొలిసారి, రెండో సారి నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత కూడా ఎవరూ పోటీ రానప్పుడు మాత్రమే మూడోసారి సింగిల్ బిడ్డర్‌కు ఇవ్వాలి. కానీ ఇటీవల తాడిపత్రి-పాతపల్లె రోడ్డు పనులు అర్హత లేని కాంట్రాక్టరుకు అప్పజెప్పినట్టు తెలిసింది. రూ.4.64 కోట్ల విలువైన ఈ పనుల విషయంలో కనీసం కాంట్రాక్టరు అర్హత కూడా చూడలేదు. కాంట్రాక్టరుతో ఆర్‌అండ్‌బీలో ఓ ఉన్నతాధికారి మామూళ్లు తీసుకుని ఇచ్చినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఒకటికి రెండు సార్లు టెండరు డాక్యుమెంట్లు పరిశీలించాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

బిల్లు పెట్టాలంటే మామూళ్లు ఇవ్వాల్సిందే

ఆర్‌అండ్‌బీ పరిధిలో చాలాచోట్ల కార్యాలయ, ఆస్పత్రుల భవన నిర్మాణాలు జరిగాయి. వాటికి బిల్లుల కోసం కాంట్రాక్టర్లు ఆర్‌అండ్‌బీ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. రెండు శాతం పర్సెంటేజీ ఇస్తే వెంటనే బిల్లులు పెడతారని, లేదంటే 'సైట్ విజిట్' అని రాస్తారని వారు వాపోతున్నారు. నిర్మాణాన్ని పరిశీలించడానికి వెళ్లి ఏదో ఒక కొర్రీ వేస్తూ బిల్లులు జాప్యం చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో కొంతమంది అధికారుల అక్రమాలు బయటకు చెబుతున్నారన్న కారణంగా సిబ్బందిని బదిలీ చేసిన ఘటనలూ ఉన్నాయి. ఆర్‌అండ్‌బీ ఇంజినీర్ల వ్యవహారంపై విజయవాడలోని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు కొంతమంది కాంట్రాక్టర్లు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

టీడీపీ నేత తమ్ముడికి జీహుజూర్

టీడీపీ మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తమ్ముడు జయప్పకు ఆర్‌అండ్‌బీ అధికారులు జీహుజూర్ అన్నారు. జయప్ప సంస్థను బ్లాక్‌లిస్టులో పెట్టాలని, అతను వర్కులు చేయడం లేదని స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మరో సంస్థ పేరుతో ఆయనకు టెండరు అప్పజెప్పిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. మడకశిర నియోజక వర్గంలోని పరిగి-యు.రంగాపురం, అమరాపురం-మధూడి, మధూడి-గాయత్రి కాలనీ రోడ్డుపనులకు ఇటీవలే టెండర్లు పిలిచారు. ఈ మూడు పనుల విలువ రూ.6.45 కోట్లు పైనే. సాధారణంగా సింగిల్ టెండరు వస్తే మళ్లీ టెండరు పిలవాలి. కానీ ఇలా చేయకుండా నేరుగా ఇచ్చారు. దీని వెనుక భారీ మొత్తం చేతులు మారినట్టు తెలుస్తోంది.



కాంట్రాక్టర్ ఎంపిక నాది కాదు

తాడిపత్రి-పాతపల్లె రోడ్డు పనుల కాంట్రాక్టరు ఎంపిక సీఈ ఆధ్వర్యంలో జరిగింది. బిల్లులు జాప్యమనేది ప్రొసీజర్‌ను బట్టి ఉంటుంది. కావాలని జాప్యం చేస్తే సంబంధిత జేఈని పిలిచి విచారించి, చర్యలు తీసుకుంటాం.

–ఓబుళరెడ్డి, ఎస్ఈ, రోడ్లు, భవనాల శాఖ

విచారణ చేసి చర్యలు

రోడ్లు, భవనాల శాఖలో వసూళ్లు చేస్తున్నట్టు నా దృష్టికి కూడా వచ్చింది. దీనిపై విచారణ చేయిస్తాం. నిజమని తేలితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

–గౌతమి, జిల్లా కలెక్టర్

విస్తరించిన ఆశల 'నైరుతి'

- రెండు రోజులూ జిల్లాకు వర్ష సూచన



ఆకాశం మేఘావృతమైన దృశ్యం

అనంతపురం అగ్రికల్చర్: ఆలస్యంగానైనా నైరుతి రుతుపవనాలు జిల్లా అంతటా విస్తరించాయి. ఈ మేరకు సోమవారం భారత వాతావరణ శాఖ విడుదల చేసిన ఛాయాచిత్రం స్పష్టం చేస్తోంది. ఈ నెల 8న కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు 13న శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాలను కూడా తాకాయి. కానీ... వాతావరణం అనుకూలించక ఐదారు రోజులు దోబూచులాడిన పవనాల్లో ఆదివారం కదలిక వచ్చింది. సోమవారం ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు రాయలసీమ జిల్లాల్లో కూడా దాదాపు విస్తరించినట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.అశోక్‌కుమార్ తెలిపారు. రుతుపవనాలు ముందుకు కదలడానికి అనుకూల పరిస్థితులు ఉన్నాయన్నారు. సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఏర్పడినందున రాగల రెండు రోజులు జిల్లాకు వర్షసూచన ఉందన్నారు. ఉరుములు, మెరుపులతో తేలికపాటి నుంచి మోస్తరుగా వర్షపాతం నమోదు కావచ్చని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే పరిస్థితి ఉందన్నారు. నైరుతి విస్తరించడంతో వర్షం కోసం అన్నదాత ఎదురు చూస్తున్నాడు. విత్తనాలు, ఎరువులతో సిద్ధంగా ఉన్న రైతులు ఖరీఫ్ పంట సాగు కోసం సమాయత్తంగా ఉన్నారు. జూలై నెలంతా విత్తుకునేందుకు మంచి అదనుగా శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఇంకా సమయం ఉన్నందున వర్షం పడితే సాఫీగా సేద్యపు పనులు చేపట్టనున్నారు.

సెంచరీ దాటిన పీజీ వైద్య సీట్లు

- కొత్తగా రేడియాలజీకి 12, ఫార్మకాలజీకి 5 సీట్లు



అనంతపురం క్రైం: బోధనాస్పత్రి(ప్రభుత్వ వైద్య కళాశాల- సర్వజనాస్పత్రి)లో పీజీ సీట్లు వంద మార్క్ దాటాయి. ఒక్క పల్మనాలజీ విభాగానికి మినహా మిగతా 16 విభాగాలకు పీజీ సీట్లు మంజూరయ్యాయి. కొత్తగా రేడియాలజీ విభాగానికి 12, ఇదివరకే రెండు సీట్లు ఉన్న ఫార్మకాలజీ విభాగానికి మరో 5 అదనపు పీజీ సీట్లను కేటాయిస్తూ నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అనంతపురం వైద్య కళాశాలలో పీజీ సీట్ల సంఖ్య 104కు చేరింది. ముఖ్యంగా రేడియాలజీ విభాగానికి అధిక సంఖ్యలో సీట్లు రావడంతో ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. దీంతో రేడియాలజీ సేవలు మరింత విస్తృతమయ్యే అవకాశం లేకపోలేదు. సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఎంఆర్ఐ, సిటీ స్కాన్, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ తదితర సేవలు పుంజుకొని రోగులకు మెరుగైన సేవలందనున్నాయి. ఫార్మకాలజీ విభాగానికి 5 సీట్లు రావడంతో ఆ విభాగం వైద్యులు హర్షం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ మాట్లాడుతూ పీజీ సీట్ల సంఖ్య వంద దాటడంతో ఏటా 312 మంది (ఫస్టియర్ 104, సెకండియర్ 104, థర్డ్ ఇయర్ 104 మంది చొప్పున) పీజీల సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. పీజీ సీట్ల పెంపుతో నూతన ఆవిష్కరణకు ఆస్కారం ఉంటుందన్నారు. రోగులకు సత్వర వైద్యం అందుతుందన్నారు. వైద్య రంగంలో ప్రభుత్వం తీసుకుంటున్న విప్లవాత్మక చర్యలతోనే ఈ స్థాయిలో పీజీ సీట్ల పెంపు సాధ్యపడిందని చెబుతున్నారు.

పోలీసుల అదుపులో నిందితుడు!

తాడిపత్రి: దంపతులపై పెట్రోల్ పోసి నిప్పంటించిన కేసులోని నిందితుడు రమేష్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మూడు రోజుల క్రితం తాడిపత్రి రూరల్ పరిధిలోని శ్రీనిధి నల్లబండల పరిశ్రమలో పని చేస్తున్న నల్లపురెడ్డి, కృష్ణవేణి దంపతులపై బంధువు అయిన రమేష్‌రెడ్డి పెట్రోల్ పోసి, నిప్పంటించాడు. ఈ ఘటనలో నల్లపురెడ్డి రెండు రోజుల క్రితం మృతి చెందాడు. కేసును సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ శ్రీనివాసరావు జిల్లా కేంద్రంలోని పోలీసులతో పాటు తాడిపత్రి డీఎస్పీ గంగయ్య ఆధ్వర్యంలో మరో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, నిందితుడిని అరెస్ట్ చేయాలని ఆదేశించారు. రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడు రమేష్‌రెడ్డిని అతని సొంత మండలం నంద్యాల జిల్లా కోవెలకుంట్లలో సోమవారం రాత్రి అదుపులోకి తీసుకుని, తాడిపత్రి రూరల్ పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చినట్లు తెలిసింది.

23న 'జగనన్న సురక్ష' పథకం ప్రారంభం

- ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు ఉచితంగా జారీ
- 24 నుంచి 30 వరకు వలంటీర్లతో ఇంటింటి సర్వే
- జూలై 1 నుంచి క్యాంపుల నిర్వహణకు కలెక్టర్ ఆదేశం



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: ప్రజలకు అవసరమైన వివిధ రకాల ధ్రువపత్రాలను ఉచితంగా అందించే 'జగనన్న సురక్ష పథకం' ఈ నెల 23న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభించనున్నారు. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. పథకం అమలుకు చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్ సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. జగనన్న సురక్ష పథకం ద్వారా జూలై 1 నుంచి జూలై 31 వరకు సచివాలయాల పరిధిలో క్యాంపులు నిర్వహించి ప్రజలకు ధ్రువపత్రాలు మంజూరు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 24 నుంచి 30 వరకు గ్రామ, వార్డు సచివాలయ పరిధిలోని వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి 'జగనన్న సురక్ష' పథకం ముఖ్య ఉద్దేశాన్ని ప్రజలకు వివరించాలని చెప్పారు. ప్రభుత్వం నుంచి వారికి ఎటువంటి ధ్రువపత్రం కావాలో తెలుసుకోవాలని ఆదేశించారు. సర్టిఫికెట్ పొందేందుకు అవసరమైన డాక్యుమెంట్‌ను తీసుకుని సచివాలయం పరిధిలో నిర్వహించే క్యాంపునకు రావాలని ప్రజలకు తెలియజేయాలన్నారు.

గడువులోగా అర్జీలు పరిష్కరించాలి

'స్పందన', 'జగనన్నకు చెబుదాం'లో ప్రజల నుంచి అందే అర్జీలను గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ గౌతమి జిల్లా అధికారులను ఆదేశించారు. ఏ ఒక్క అర్జీ రీఓపెన్ కాకుడదని చెప్పారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'స్పందన'లో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్ఓ గాయత్రిదేవి, ఆర్డీఓ మధుసూదన్, జెడ్పీ సీఈఓ భాస్కర్, డిప్యూటీ కలెక్టర్లు కేశవనాయుడు, శ్రీనివాసులు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 655 అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ అర్జీల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. 'స్పందన', 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం కనిపించరాదన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపించాలని చెప్పారు.

ప్రత్యేక అధికారుల నియామకం

ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూర్చే 'జగనన్న సురక్ష' పథకం పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రత్యేక అధికారులను నియమించనున్నామన్నారు. జూలై 1 నుంచి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో క్యాంపులను తహసీల్దార్లు, ఎంపీడీఓలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఏ గ్రామంలో క్యాంపు ఏర్పాటు చేస్తున్నారనేది ముందుగానే అక్కడి ప్రజలకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. క్యాంపులో తహసీల్దారు, ఎంపీడీఓ, మండల ప్రత్యేక అధికారి, ఆర్‌డీఓ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాల్సి ఉంటుందన్నారు. క్యాంపు నిర్వహించిన సమయంలోనే ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలను ఉచితంగా అందించాల్సి ఉంటుందన్నారు. పథకంపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రయోజనం పొందేలా చూడాలని చెప్పారు. సమావేశంలో డీఆర్వో గాయత్రీదేవి, ఆర్డీఓ మధుసూదన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్షుద్రపూజల పేరుతో మహిళల ట్రాప్



అరెస్ట్ వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న వైఎస్సార్ జిల్లా ఏఎస్పీ ప్రేరణాకుమార్

- తిరుపతికి చెందిన మహిళ ఫిర్యాదుతో వెలుగులోకి
- ఏడుగురు ముఠా సభ్యుల అరెస్టు
- ప్రధాన సూత్రధారుడు బాబా కోసం పోలీసుల గాలింపు

ప్రొద్దుటూరు క్రైం : క్షుద్రపూజల పేరుతో మహిళలను ట్రాప్ చేస్తున్న ముఠా గుట్టు రట్టయ్యింది. తిరుపతికి చెందిన బాధిత మహిళ ఫిర్యాదుతో ముఠా మోసాలు వెలుగులోకి వచ్చాయి. ఈ క్రమంలో ముఠాలోని ఏడుగురు సభ్యులను వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రధాన సూత్రధారుడు అయిన బాబా కోసం గాలిస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్ సోమవారం మీడియాకు వెల్లడించారు. తిరుపతికి చెందిన ఒక మహిళ ఆర్థిక సమస్యలతో బాధపడేది. తన కుమార్తెలకు వయసు వచ్చినా ఇంకా పెళ్లిళ్లు కాలేదు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు మనోవేదనకు గురయ్యేవారు. ఈ క్రమంలో ఓ బాబా క్షుద్రపూజలు చేస్తే ఆర్థిక సమస్యలతో పాటు కుటుంబంలోని ఇతర సమస్యలు కూడా పూర్తిగా తీరిపోతాయని ఒక మహిళ ద్వారా తెలుసుకున్న ఆమె.. సదరు ముఠా సభ్యులను ఆశ్రయించింది. తిరుపతి మహిళను ఫోన్‌లో సంప్రదించిన మోసగాళ్లు ఆమెను కడపకు రమ్మని చెప్పారు. కొన్ని రోజుల క్రితం ముఠా సభ్యులు కొందరు ఆమెతో కడపలో సమావేశం అయ్యారు. అయితే వారు పెట్టిన కొన్ని షరతులకు ఆమె అంగీకరించకపోవడంతో రెండు రోజుల క్రితం తిరిగి వారు ప్రొద్దుటూరులో సమావేశమయ్యారు. ఈ క్రమంలో పూజలు చేస్తామని నమ్మబలికిన కేటుగాళ్లు ఆమెను లైంగికంగా వేధింపులకు గురి చేశారు. దీంతో వారి బారి నుంచి తప్పించుకుంది. జరిగిన విషయాన్ని పోలీసులకు తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏడుగురు నిందితుల అరెస్ట్

ఏఎస్పీ ప్రేరణాకుమార్ ఆదేశాల మేరకు సీఐ యుగంధర్, ఎస్ఐ కృష్ణంరాజునాయక్‌లు సిబ్బందితో కలిసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ముఠా సభ్యులు అమృతానగర్‌లో ఉన్నారని తెలియడంతో దాడులు నిర్వహించారు. దాడిలో అనంతపురం జిల్లాకు చెందిన వసారింటి నాగరాజు, కంబగిరి రాముడు, వడ్డే వెంకటేష్, కర్నూలు జిల్లాకు చెందిన మార్కె కంబగిరి రాముడు, మొట్టే కాంతమ్మ, నంద్యాల జిల్లాకు చెందిన జిట్టా రవికుమార్, తిరుపతికి చెందిన పొలిచెర్ల ప్రియను అరెస్ట్ చేశారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపిస్తున్నట్లు ఏఎస్పీ తెలిపారు. విచారణలో భాగంగా నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు ప్రధాన సూత్రధారి బాబా, మరి కొందరి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

వ్యభిచార కూపంలోకి దింపే ప్రయత్నం..

ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న మహిళలను ఈ ముఠా టార్గెట్ చేస్తోంది. ఇందుకోసం ముఠాలోని మహిళలను ఏజెంట్లుగా ఉపయోగించుకుంటున్నారు. వారి ద్వారానే అమాయక మహిళలను ట్రాప్ చేస్తున్నారు. కుద్ర పూజలకు అంగీకరించిన మహిళలను లొంగదీసుకొని వ్యభిచార కూపంలోకి దింపే ప్రయత్నం జరుగుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. కాగా ప్రొద్దుటూరుతో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల వ్యభిచార నిర్వాహకులతో వీరికి సంబంధం ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. వారి వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. వీరి ఉచ్చులో పడి ఎంత మంది మహిళలు మోసపోయారనే దానిపై కూడా పోలీసులు లోతుగా విచారణ చేస్తున్నారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సీఐ యుగంధర్, ఎస్ఐ కృష్ణంరాజునాయక్, బ్లూకోల్ట్స్ సిబ్బందిని ఎస్పీ అన్బురాజన్, ఏఎస్పీ ప్రేరణాకుమార్ అభినందించారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు



హాజరైన అధికారులు, ప్రైవేటు విద్యాసంస్థల ప్రతినిధులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

- ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు చేరాలి
- కలెక్టర్ గౌతమి ఆదేశం

అనంతపురం అర్బన్: ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు కాకుండా అధికంగా వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ గౌతమి హెచ్చరించారు. ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు ప్రతి విద్యార్థికీ చేరాలని కచ్చితమైన ఆదేశాలిచ్చారు. ఫీజులు, పాఠ్యపుస్తకాల అంశంపై కలెక్టర్ సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో ఆర్‌టీఏ కమిషనర్, ఆర్ఐఓ, అనంతపురం ఆర్డీఓ, డీఈఓతో కలిసి ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ గుర్తింపు లేకుండా పాఠశాలలను నిర్వహించరాదన్నారు. అలాంటివి ఉంటే తక్షణం నిర్ణీత సమయంలో గుర్తింపు తెచ్చుకోవాలని ఆదేశించారు. పుస్తకాలు, యూనిఫామ్, ఫీజు విషయంలో అధికంగా వసూలు చేస్తున్నట్లు పెద్దసంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అందరికీ అందుబాటులో ఉండే విధంగా ఫీజు ఉండాలని సూచించారు. స్కూలు బస్సులను నిబంధనల మేరకు నడపాలన్నారు. ప్రతి పాఠశాలలో విద్యాహక్కు చట్టం కింద ఒకటో తరగతిలో పేద పిల్లలకు 25 శాతం ఉచిత సీట్లు కేటాయించాలని ఆదేశించారు.

పేద విద్యార్థులకు సీఎం ప్రోత్సాహం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నారని కలెక్టర్ అన్నారు. విద్యావ్యవస్థలో వివిధ పథకాలను ప్రవేశపెట్టి పేద విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారన్నారు. పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం చేయూత ఇవ్వాలని చెప్పారు. సమావేశంలో డీటీసీ వీర్రాజు, ఆర్ఐఓ సురేష్ బాబు, డీఈఓ సాయిరాం, ఆర్డీఓ మధుసూదన్, ఇతర అధికారులు, ఎంఈఓలు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పందిని ఢీకొని యువకుడి మృతి

పెద్దవపప్పూరు: రోడ్డుకు అడ్డంగా వచ్చిన అడవి పందిని ఢీకొని ఓ ద్విచక్ర వాహనదారుడు మృతిచెందాడు. మృతుడిని కోల్‌కత్తాకు చెందిన జాకీర్(32)గా పోలీసులు గుర్తించారు. అనంతపురం, తాడిపత్రిలో చీరల డిజైనర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం అనంతపురంలో పని ముగించుకుని రాత్రికి తాడిపత్రికి ద్విచక్ర వాహనంపై ప్రయాణమైన జాకీర్.. అటవీ ప్రాంతంలో రోడ్డుకు అడ్డంగా దూసుకొచ్చిన అడవి పందిని ఢీకొని అదుపు తప్పి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఖాజాహుసేన్ తెలిపారు.

మసకబారుతున్న ప్రతిష్ట

రైల్వే ఆస్పత్రిలో సమస్యల తిష్ట

- వరుస వైఫల్యాలతో బెంబేలెత్తుతున్న రోగులు
- గణనీయంగా తగ్గిన ఓపీ సేవలు
- శస్త్రచికిత్సల్లోనూ కనిపించని పురోగతి



గుంతకల్లు రైల్వే డివిజనల్ ఆస్పత్రి ముఖద్వారం

గుంతకల్లు: గతమెంతో ఘన కీర్తి కలిగిన గుంతకల్లు రైల్వే డివిజనల్ ఆస్పత్రి ప్రతిష్ట ఇటీవల ఉద్యోగుల తీరుతో మసకబారుతోంది. రోజురోజుకూ అధ్వానంగా మారిన వైద్య సేవలతో రోగులు నానా ఇక్కట్లు పడుతున్నారు. ఇటీవల కుటుంబ నియంత్రణ ఆపరేషన్ వికటించి ఓ వివాహిత మృతి చెందింది. మూడు రోజుల క్రితం ఓ మహిళకు గర్భసంచి తొలిగించే ఆపరేషన్ చేస్తూ ఏకంగా మూత్ర నాళాన్ని కట్ చేశారు. దీంతో రైల్వే ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందాలంటే రైల్వే ఉద్యోగులు, రోగులు బెంబేలెత్తిపోతున్నారు.

200కు పడిపోయిన ఓపీ..

గుంతకల్లు రైల్వే డివిజన్‌లో పనిచేస్తున్న దాదాపు 15 వేల మంది ఉద్యోగులు, వీరి కుటుంబసభ్యులు, ఉద్యోగ విరమణ చేసిన వారితో కలిపి లక్ష మందికి పైగా రైల్వే ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్నారు. గతంలో రోజూ 500 మందికి పైగా ఓపీ సేవలు అందుకునే వారు. ఇటీవల వరుస వైఫల్యాలతో ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం రోజుకు 200కు మించి ఓపీ నమోదు కాకపోవడమే ఇందుకు నిదర్శనం. అలాగే శస్త్రచికిత్సల అంశంలోనూ పురోగతి కనిపించడం లేదు. గతంలో నెలకు 300 నుంచి 400 శస్త్రచికిత్సలు నిర్వహించినట్లుగా ఆస్పత్రి రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం నెలకు 30 ఆపరేషన్లు కూడా జరగని పరిస్థితి నెలకొంది. అరకొరగా చిన్నపాటి ఆపరేషన్లు చేసినా.. అందులో ఎక్కువ శాతం విఫలమై రోగుల పరిస్థితి విషమంగా మారిన సందర్భాలే ఉన్నాయి.

ఆధునిక వైద్య పరికరాలున్నా..

దక్షిణ మధ్య రైల్వేలో వరుసగా మూడుసార్లు బెస్ట్ అవార్డు అందుకున్న ఘన చరిత్ర కలిగిన గుంతకల్లు రైల్వే డివిజనల్ ఆస్పత్రిలో రూ.కోట్లు ఖరీదైన ఆధునిక ఆపరేషన్ థియేటర్, వివిధ వైద్య పరికరాలు ఉన్నాయి. క్లిష్టమైన ఆపరేషన్లను సైతం ఇక్కడ విజయవంతంగా నిర్వహించిన సందర్భాలు అనేకమున్నాయి. దీంతో సుదూర ప్రాంతాల నుంచి సైతం రోగులు ఈ ఆస్పత్రికి వచ్చేవారు. తాజాగా చోటు చేసుకున్న కొన్ని వైఫల్యాల కారణంగా ఆస్పత్రి కీర్తి కాస్త మసకబారుతోంది. దీంతో ఈ ఆస్పత్రిలో వైద్యసేవలు పొందాలంటే రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు వెనుకంజ వేస్తున్నారు. ఫలితంగా ఒకప్పుడు అత్యున్నత వైద్య సేవలు అందించిన ఈ ఆస్పత్రి ప్రస్తుతం కేవలం జ్వరం, తలనొప్పి, జలుబు వంటి చిన్నపాటి జబ్బుల చికిత్సలకే పరిమితమవుతోంది.

సమన్వయ లోపమే కారణమా?..

ఆస్పత్రి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్, డాక్టర్లు, నర్సుల మధ్య సమన్వయం కొరవడడంతో వైద్య సేవలు నానాటికీ క్షీణిస్తూ వచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన ఘటన ఇందుకు నిదర్శనం. టైఫాయిడ్ జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరిన కొందరు చిన్నారులకు చికిత్స చేసిన డాక్టర్ ఇచ్చిన ప్రిస్క్రిప్షన్ ఆధారంగా కాకుండా కింది స్థాయి సిబ్బంది కాంబినేషన్ మందులు ఇవ్వడంతో వారి పరిస్థితి విషమించింది. దాదాపు 8 మంది పిల్లలు ఎంతో ఇబ్బంది పడ్డారు. వీరిలో ముగ్గురు చిన్నారులను హుటాహుటిన అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడారు. ఇప్పటికైనా ఆస్పత్రిలోని అన్ని విభాగాలను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైల్వే ఉన్నతాధికారులను ఉద్యోగులు కోరుతున్నారు.

ఫెర్రర్ జీవితం ఆదర్శప్రాయం

- వర్ధంతి సభలో ఎంపీ తలారి రంగయ్య



ఫెర్రర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ రంగయ్య, తదితరులు

అనంతపురం కల్చరల్: పేదల పెన్నిధిగా ఆదర్శప్రాయ జీవితాన్ని గడిపిన డాక్టర్ విన్సెంట్ ఫెర్రర్ సేవలు స్ఫూర్తిదాయకమని ఎంపీ తలారి రంగయ్య అన్నారు. గుర్రం జాషువా సాహిత్య పీఠం ఆధ్వర్యంలో ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ 15వ వర్ధంతి సభ సోమవారం నిర్వహించారు. కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఫెర్రర్ విగ్రహం వద్ద అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు నివాళులర్పించారు. ఎంపీ తలారి రంగయ్య, మేయర్ వసీం సలీం, ఆర్డీటీ చైర్మన్ తిప్పేస్వామి, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, ఆర్డీటీ ఎడ్యుకేషనల్ డైరెక్టర్ చంద్రశేఖర్ నాయుడు, కార్పొరేటర్లు అనిల్‌కుమార్ గౌడ్, లీలావతి, కమలభూషణ్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ రిజ్వాన్, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ రంగస్వామి, జాషువా సాహిత్య పీఠం కన్వీనర్ నాగలింగయ్య, సాహితీవేత్తలు డాక్టర్ నానీల నాగేంద్ర, పూజారి ఈరన్న, ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ నాగేశ్వరరెడ్డి, సీనియర్ కవి నబీరసూల్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీదేవి, నగర అధ్యక్షుడు చింతా సోమశేఖరరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఖాజా, కుళ్లాయిస్వామి, భారతి, రాధ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి వేదికగా నేడు ఎంహెచ్ స్మారక అవార్డు ప్రదానం

పుట్టపర్తి అర్బన్: కామ్రేడ్ మోటూరు హనుమంతరావు (ఎంహెచ్) స్మారక ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు ప్రదానోత్సవాన్ని పుట్టపర్తిలోని ఆర్‌వీ జానకీ రామయ్య కల్యాణమంటపంలో మంగళవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రజాశక్తి సాహితీ సంస్థ పేర్కొంది. ప్రజాశక్తి సంపాదకుడు తులసీదాస్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి గోపాలగౌడ హాజరు కానున్నారు. 'రాజ్యాంగానికి ఎదురవుతున్న సవాళ్లు-మీడియా పాత్ర' అంశంపై స్మారకోపన్యాసం చేయనున్నారు. మంత్రి ఉషశ్రీచరణ్, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ ఎంహెచ్ అవార్డు కమిటీ చైర్మన్ తెలకపల్లి రవి, నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగాధిపతి జి.అనిత, కవి నల్లి ధర్మారావు తదితరులు హాజరు కానున్నారు. ఎంహెచ్ స్మారక అవార్డును నవభూమి పత్రిక (హైదరాబాద్) టి.ప్రసాద్‌కు, బొమ్మారెడ్డి స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును రాజమహేంద్రవరం ప్రజాశక్తి స్టాఫ్ రిపోర్టర్ శ్రీనివాసచారికి, మండల విలేకరుల విభాగంలో హిందూపురం, సింగరాయకొండకు చెందిన షబ్బీర్, రవికుమార్‌కు అందజేయనున్నారు.

రైతు సంక్షేమమే జగనన్న లక్ష్యం



రైతులకు పరికరాలను అందజేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం రూరల్: రైతు సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. కళ్యాణదుర్గం మండలం బోరంపల్లిలో డ్వామా ఆధ్వర్యంలో రైతులకు టార్పాలిన్లు, స్ప్రేయర్లు పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి ఉషశ్రీచరణ్ హాజరయ్యారు. రైతుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న పథకాలను వివరించారు. మైక్రో వాటర్ షెడ్ పథకం కింద ఎస్సీలకు 10 శాతం రాయితీ, బీసీ, ఓసీలకు 20 శాతం రాయితీతో తైవాన్ స్ప్రేయర్లు, బ్యాటరీ పంపులు, టార్పాలిన్లు, ఛాప్‌కట్టర్ తదితర పరికరాలను అందిస్తున్నట్లు వివరించారు. ఈ పథకం కింద ప్రతి రైతుకూ లబ్ధి చేకూర్చేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. రానున్న రోజుల్లో వర్షాలు సమృద్ధిగా కురిసే అవకాశాలున్నాయని, ఈ క్రమంలో వర్షపు నీటిని ఒడిసి పట్టేలా ఇంకుడు గుంతలు, ఫారంపాండ్లు, చెక్‌డ్యాంలు వంటి నిర్మాణాలను చేపట్టాలన్నారు. రాబోవు తరానికి నీటి కొరత లేకుండా ప్రతి నీటి బొట్టును రక్షించుకోవాల్సిన అవసరం రైతులందరిపై ఉందన్నారు. రాబోవు ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకుందామంటూ పిలుపునిచ్చారు. అనంతరం ఎంపికైన 198 మంది రైతులకు 587 వ్యవసాయ పరికరాలను రాయితీతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, వాటర్‌షెడ్ పీడీ సుధాకర్‌రెడ్డి, పీఓ శ్రీవిద్య, ఎంపీపీ మారుతమ్మ, వాటర్‌షెడ్ చైర్మన్ కృష్టారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు తిప్పమ్మ, సచివాలయాల కన్వీనర్ భట్టువానిపల్లి ఆంజినేయులు, ఏఓ జగదీష్, టీఓ శేషశయన, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం టౌన్: జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ నాగరాజారావు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం కింద ఉత్పత్తి రంగంలో పరిశ్రమల ఏర్పాటుతో పాటు సేవా రంగంలో గేదెలు, గొర్రెల పెంపకం, కోళ్లఫారం, జిరాక్స్ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఉత్పత్తి రంగంలో యూనిట్ ఏర్పాటుకు రూ.50లక్షలు, సేవా రంగంలో యూనిట్ ధర రూ.20లక్షల వరకు కేటాయించారు. అర్బన్ ప్రాంత్రాలో ఏర్పాటు చేసే నిరుద్యోగులకు 25 శాతం, రూరల్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే వారికి 35 శాతం వరకు సబ్సిడీ ఉంటుంది. పూర్తి సమాచారానికి జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయంలోని హెల్ప్ డెస్క్‌ను సంప్రదించవచ్చు.

ప్రతి ఒక్కరూ రక్తదాతలు కావాలి



విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్రను సన్మానిస్తున్న కలెక్టర్ గౌతమి (చిత్రంలో) జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: రక్తదానంతో మరొకరి ప్రాణాలను కాపాడవచ్చునని కలెక్టర్ ఎమ్.గౌతమి అన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదాతలుగా మారి ప్రాణదాతలవ్వాలని ఆకాంక్షించారు. ప్రపంచ రక్తదాతల దినం రోజున విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో అనంతపురం సర్కిల్ ఏపీఎస్‌పీడీసీఎల్ ఉద్యోగులు 201 యూనిట్ల రక్తం దానం చేశారు. ఈ బృహత్తర కార్యక్రమ రూపకర్తైన విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్రను అభినందిస్తూ సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ గౌతమి ఘనంగా సన్మానించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ మెమెంటోను అందజేశారు. రక్తదానం చేసిన విద్యుత్ శాఖ ఉద్యోగులను అభినందించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌ను కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు సన్మానించారు. అజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించి 590 యూనిట్ల రక్తం సేకరించిన గుంతకల్లు ఆర్డీఓ రవీంద్రను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్ఓ గాయత్రీదేవి, రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ డాక్టర్ లక్ష్మణ ప్రసాద్, కార్యవర్గ సభ్యులు డాక్టర్ మనోరంజన్ రెడ్డి, సుధీర్, హరణిరెడ్డి పాల్గొన్నారు.

వడ్డీతో సహా బీమా పరిహారం చెల్లించండి

- బీమా సంస్థను ఆదేశించిన వినియోగదారుల ఫోరం కమిషన్

అనంతపురం: వడ్డీతో సహా వ్యక్తిగత బీమా పరిహారాన్ని చెల్లించాలని బీమా సంస్థ యాజమాన్యాన్ని జిల్లా వినియోగదారుల ఫోరం కమిషన్ ఆదేశించింది. ఈ మేరకు ఫోరం కమిషన్ అధ్యక్షురాలు ఎం.శ్రీలత సోమవారం తీర్పు వెలువరించారు. వివరాలు.. తాడిపత్రికి చెందిన బ్రహ్మానంద రెడ్డి కారును కొనుగోలు చేసి, చోళ ఎంఎస్ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థలో బీమా చేయించారు. పాలసీ అమలులో ఉన్న సమయంలో వ్యక్తిగత ప్రమాద బీమా కింద యజమానితో పాటు డ్రైవర్‌కు రూ.15 లక్షల పరిహారం వర్తించేలా రూ.3,985 ప్రీమియం చెల్లించారు. 2020, మార్చి 11న తన భార్య శ్రీవాణితో కలసి అనంతపురం నుంచి తాడిపత్రికి వెళుతుండగా కారు చక్రం పేలడంతో ప్రమాదం చోటు చేసుకుని బ్రహ్మానంద రెడ్డికి తీవ్రంగా గాయపడ్డాడు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. భర్త మృతికి పరిహారంగా వ్యక్తిగత ప్రమాద బీమా కింద రూ.15 లక్షల రూపాయలు చెల్లించాలని బీమా సంస్థను శ్రీవాణి కోరింది. వారి నుంచి సరైన స్పందన రాకపోవడంతో లీగల్ నోటీసు అందజేసింది. ఇందుకు జవాబు రాకపోవడంతో జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించింది. కమిషన్ నోటీసులు అందుకున్న బీమా సంస్థ ప్రతినిధులు హాజరై తమకు ధ్రువీకరణ పత్రాలు అందని కారణంగా ఫిర్యాదు చెల్లదని వాదనలు వినిపించారు. శ్రీలత పంపిన లీగల్ నోటీసును కమిషన్ పరిశీలించింది. దీంతో బీమా చెల్లింపు ఆలస్యాన్ని సేవా లోపంగా పరిగణిస్తూ ఫిర్యాదు దాఖలు చేసిన తేదీ నుంచి ఆరు శాతం వడ్డీతో సహా రూ.15 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా పరిహారం, సేవాలోపానికి, మనో వేదనకు గురి చేసినందుకు రూ.10వేలు, ఖర్చుల నిమిత్తం రూ.5వేలును నెలలోపు చెల్లించాలని కమిషన్ అధ్యక్షురాలు శ్రీలత, సభ్యులు గ్రేస్‌మేరీ, గోపీనాథ్‌తో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది.

మహిళామార్ట్‌లో ఉద్యోగావకాశాలు

అనంతపురం: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ-అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా సీడాప్ ఆధ్వర్యంలో ప్రముఖ ప్రైవేట్ సంస్థ నిర్వహిస్తున్న 'మహిళా మార్ట్'లో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. ఈ మేరకు డీఆర్‌డీఏ పీడీ ఐ.నరసింహారెడ్డి తెలిపారు. ఎంపికైన వారికి యూనిఫాం తప్పనిసరిగా ఉంటుంది. ఆధార్‌కార్డు, స్మార్ట్‌ఫోన్, ఏ ప్రాంతంలోనైనా పనిచేయడానికి సిద్ధంగా ఉండాలి. రెండు నెలల ముందే నోటీసు ఇచ్చి ఉద్యోగాన్ని విరమించాలి. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 21 అనంతపురంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు తప్పనిసరిగా తీసుకురావాలి. పూర్తి వివరాలకు 08554-2471122, 89850 91256లో సంప్రదించవచ్చు.

ఉద్యోగం	అర్హత	వయస్సు	వేతనం	పనిచేసే ప్రాంతం
స్టోర్ మేనేజర్	ఇంటర్/డిగ్రీ	24-35	రూ.12 వేలు - రూ.15వేలు	బత్తలపల్లి, కూడేరు, గుత్తి
సేల్స్‌పర్సన్	పది/ఇంటర్	20-35	రూ.8వేలు - రూ.12వేలు	బత్తలపల్లి, గార్లదిన్నె, కూడేరు, గుత్తి
ప్రొక్యూర్మెంట్ మేనేజ్‌మెంట్	పది/ఇంటర్	21-35	రూ.12వేలు - రూ.15వేలు	అనంతపురం
సూపర్‌వైజర్	ఇంటర్	21-35	రూ.12వేలు	అనంతపురం
ఐటీ	డిగ్రీ	21-35	రూ.12 - రూ.15వేలు	అనంతపురం
లోకల్ హెల్పర్స్	పది	21-35	రూ.10 - రూ.12 వేలు	అనంతపురం
డ్రైవర్ (కేవలం పురుషులు)	పది	21-35	రూ.15వేలు	అనంతపురం
సెక్యూరిటీ గార్డ్స్ (కేవలం పురుషులు)	పది	21-35	రూ.10 - రూ.12 వేలు	బత్తలపల్లి, గార్లదిన్నె, కూడేరు, గుత్తి, అనంతపురం .

క్లుప్తంగా

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



నగదు బహుమతి అందిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంపీపీ సుబ్బర హేమలత, ఆత్మకూరు సర్పంచ్ వరలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాలయంలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతిలో 496 మార్కులు సాధించిన లక్ష్మికి రూ.3 వేలు, 470 మార్కులు సాధించిన జాహ్నవికి రూ.2 వేలు, 439 మార్కులు సాధించిన మేఘ సింధూకు రూ.1000 నగదు, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 రామాంజనేయులు, కేజీబీవీ ప్రిన్సిపాల్ లీమా రోజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ పథకాలు అందాలి

అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలతో సంబంధం లేకుండా ప్రభుత్వ పథకాలు అందించాలని ఎంపీపీ హేమలత తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్ షర్మిల, ఎంపీడీఓ విజయ్ ప్రసాద్, ఈవోఆర్డీ దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ వలంటీర్లకు జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహిచారు.

కూలీలు వందరోజులు పూర్తి చేయాలి

- డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి

ఆత్మకూరు: జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనులను సద్వినియోగం చేసుకొని, వందరోజుల పనిదినాలు పూర్తి చేయాలని డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆత్మకూరు మండలంలోని పంపనూరు వద్ద జరగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. పనులు ఎంత మేరకు జరిగాయన్న విషయాలను ఉపాధి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు పి. యాలేరు లో ఎంపీపీ సుబ్బర హేమలత, ఎంపీడీఓ విజయ్‌ప్రసాద్, ఏపీఓ సుజాత ఉపాధి పనులను పరిశీలించారు.

ఆర్జేడీని కలిసిన వైఎస్సార్ టీఎఫ్ నాయకులు




ఆర్జేడీకి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు

రాప్తాదురూరల్: ప్రాథమిక విద్య ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డిని వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు సోమవారం కడప ఆర్జేడీ కార్యాలయంలో కలిశారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఓబుళపతి , రాష్ట్ర గౌరవాధ్యక్షులు హెచ్. గిరిధర్‌రెడ్డి, రాష్ట్ర కోశాధికారి వి. రాజమోహన్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చల్లా ప్రసాద్ రెడ్డి, వైయస్సార్ కడప జిల్లా అధ్యక్షుడు ఈసీ విశ్వనాథ రెడ్డి, నాయకులు శ్రీనివాసరెడ్డి, రాజారెడ్డి తదితరులు కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం అందించారు. ఉపాధ్యాయుల సర్వీస్ సమస్యలు పరిష్కరించాలని, కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో సమస్యలు పరిష్కరించేలా చూడాలని ఆర్జేడీని కోరారు.

స్పందనలో 14 ఫిర్యాదులు

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 14 ఫిర్యాదులు వచ్చాయి. డిప్యూటీ కమిషనర్ సావిత్రి ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని ఆదేశించారు. ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, మేనేజర్ లక్ష్మీదేవి, డీఈ శేఖర్, సూపరింటెండెంట్లు ఖయాం, విజయ్‌కుమార్, దేవశంకర్ పాల్గొన్నారు.

'జేఈఈ అడ్వాన్స్‌డ్'లో ఆత్మకూరు విద్యార్థి సత్తా



సర్దార్‌వలికి స్వీట్స్ తినిపిస్తున్న తల్లి ముబీనా

ఆత్మకూరు: ఐఐటీలో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో ఆత్మకూరుకు చెందిన విద్యార్థి సత్తా చాటాడు. ఆత్మకూరుకు చెందిన షెక్షావలి, ముబీనా దంపతుల కుమారుడు సర్దార్‌వలి 248వ ర్యాంక్ సాధించాడు. ఇంటర్ పూర్తికాగానే సర్దార్ వలి ఏడాది పాటు కోచింగ్ తీసుకుని జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాశాడు. ఉత్తమ ర్యాంక్ దక్కడంతో తల్లిదండ్రులు ఆనందపడ్డారు.

నేడు భూమిపూజ

చెన్నేకొత్తపల్లి: మేడాపురంలో నిర్మించనున్న విద్యుత్ స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి భూమి పూజ చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఆటో ఇటో వాహనం.. రైట్ ఎటు చెప్పాలి గురూ..!

నగరం దినదినాభివృద్ధి చెందుతోంది.. రహదారుల రూపురేఖలు మారాయి. అందుకు తగ్గట్టు వాహనాల రద్దీ అధికమైంది. ఏ చిన్న పని ఉన్నా వాహనంపై వెళ్తున్నారు. దీంతోపాటు రోడ్డు భద్రత నిబంధనలను బేఖాతరు చేస్తున్నారు. ఆటోలు, బైక్‌లు, ఇతర వాహనాలు అడ్డదిడ్డంగా రోడ్డుపై వెళ్తుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. అనంతపురం నగరంలో మధ్యాహ్నం సమయంలో ఏ సర్కిల్‌లో చూసినా ట్రాఫిక్ స్తంభిస్తోంది. పోలీసుల సూచనలు, ప్రభుత్వ నిబంధనలు పాటిస్తే ఏ ఒక్క వాహనదారుడూ ఇబ్బంది పడాల్సిన అవసరం ఉండదని పలువురు అంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



సప్తగిరి సర్కిల్‌లో మధ్యాహ్నం 1 గంట సమయంలో స్తంభించిన ట్రాఫిక్



ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్న కానిస్టేబుల్



శ్రీకంఠం సర్కిల్‌లో అడ్డదిడ్డంగా వెళ్తున్న వాహనాలు



ట్రాఫిక్‌లో మహిళ అవస్థలు



వాహనాలుస్తంభించడంతో మొబైల్ చూస్తున్న ఓ వాహనదారుడు

కెనరా బ్యాంకులో సిబ్బందిని నియమించాలి

రాప్తాదురూరల్: అనంతపురం రూరల్ మండలం చియ్యేడు కెనరా బ్యాంక్‌లో సిబ్బందిని నియమించాలని సీపీఐ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం లీడ్ బ్యాంక్ మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ చియ్యేడు బ్యాంక్‌లో మూన్నెళ్లుగా అరకొర సిబ్బందితో రైతులకు రెన్యూవల్ కూడా చేయలేకపోతున్నారన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఇంకా రెన్యూవల్స్ కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. డ్వాక్రా మహిళలకు ఇంతవరకూ పావలా వడ్డీ కూడా ఖాతాల్లో జమ కాలేదన్నారు. డిపాజిట్లు విత్‌డ్రా చేసుకునేందుకు రోజుల తరబడి పనులు మానుకొని బ్యాంకు వద్ద పడికాపులు కాస్తున్నారన్నారు. తగినంత సిబ్బందిని నియమించాలని కోరారు. లీడ్ బ్యాంక్ మేనేజర్‌ను కలిసిన వారిలో రైతు సంఘం జిల్లా నాయకులు వన్నారెడ్డి, నారాయణస్వామి, శ్రీకాంత్, రాము, ధనుంజయ, రెడ్డప్ప ఉన్నారు.

లోక్ అదాలత్ చైర్మన్ నేడు రాక

అనంతపురం: లోక్ అదాలత్ చైర్మన్ కె.శ్రీనివాసరావు మంగళవారం అనంతపురానికి రానున్నారు. జిల్లా కోర్టులోని న్యాయ సేవాసదన్‌లో లోక్‌అదాలత్ అంశాలపై న్యాయ అధికారులతో సమీక్షించనున్నారు.

నగరం రూపురేఖలు మార్చేశాం

అనంతపురం క్రైం: గత ప్రభుత్వంలో నగరాభివృద్ధి కుంటుపడింది.. అప్పట్లో టీడీపీ నాయకులు కలహాలతో అలజడి వాతావరణం నెలకొనింది.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత నగర రూపురేఖలు మార్చేశామని మేయర్ వసీం పేర్కొన్నారు. సోమవారం నగరంలోని 21వ డివిజన్ అంబేడ్కర్ నగర్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.29 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మేయర్ వసీం పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టాలని ఇంజినీర్లను ఆయన ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశీస్సులతో జిల్లా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.600 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. సీఎం స్పెషల్ గ్రాంట్ రూ.25 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు.



అంబేడ్కర్‌నగర్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

తాగునీటి సమస్య రానివ్వొద్దు..

ఎస్ఎస్ ట్యాంకు వద్ద మెయిన్ పైప్‌లైన్ లీకేజీ కావడంతో వాటి మరమ్మతు పనులను మేయర్ పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టాలన్నారు. భవిష్యత్‌లో తాగునీటి సమస్య రానివ్వకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్పొరేటర్లు చంద్రకళ, అనిల్‌కుమార్ రెడ్డి, కమల్‌భూషణ్, ఈఈ చంద్రశేఖర్, నాయకులు ఖాజా, కుళ్లాయిస్వామి, సురేష్, రవి, ఏఈ బాబావలి, ట్యాప్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్..నోరు అదుపులో పెట్టుకో

- డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి

అనంతపురం క్రైం: పవన్ కళ్యాణ్.. నోరు అదుపులో పెట్టుకోవాలని, లేదంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దేశ చరిత్రలోనే ఏ ముఖ్యమంత్రి అందించిన విధంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రిపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అర్థరహిత ఆరోపణలు చేయడం సరికాదన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో మహిళా అధికారులపై దాడులు, మహిళలపై అత్యాచారాలు జరిగినప్పుడు ఏం చేస్తున్నావ్ అని ప్రశ్నించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ విప్లవాన్ని తీసుకొచ్చారని, సంక్షేమ పథకాలు లబ్ధిపొందిన ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో ప్రశాంత జీవనం సాగిస్తుంటే, పవన్ కళ్యాణ్ తన ఉనికిని కాపాడుకునేందుకు ప్రజలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. వారాహీ వాహనం పేరును నారాహీగా మార్చుకోవాలన్నారు. అభివృద్ధిలో ఏపీ అగ్రగామిగా నిలుస్తోందన్నారు. ఇప్పటికైనా పవన్ కళ్యాణ్ ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కోగటం

నట్టల నివారణ మందు తాపించాలి

ఆత్మకూరు: మండలంలోని జీవాలకు నట్టల నివారణ మందు తాపించాలని ఎంపీపీ సుబ్బర హేమలత సూచించారు. సోమవారం మండలంలోని పి.యాలేరులో గొర్రెలకు ఎంపీపీ నట్టల నివారణ మందు వేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ఈ నెల 30 వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. జీవాలకు ఎలాంటి వ్యాధులు, రోగాల బారిన పడకుండా ఉండేందుకు మందులు వాడుతారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరోగ్యం రెడ్డి, వైస్ ఎంపీపీ నీలిమ, వైఎస్సార్ సీపీ నాయకులు ఫణిరెడ్డి పాల్గొన్నారు.



పి.యాలేరులో నట్టల నివారణ మందు వేస్తున్న ప్రజాప్రతినిధులు

45 మంది కార్యదర్శులకు 'షోకాజ్'

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలోని వివిధ సచివాలయాల్లో పనిచేస్తున్న 45 మంది పారిశుధ్య కార్యదర్శులకు కమిషనర్ రమణారెడ్డి సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కొన్ని రోజులుగా విధులకు తప్పక హాజరుకావాలని కమిషనర్ నేరుగా, సెల్ కాన్ఫరెన్స్ ద్వారా స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా విధులకు గైర్హాజరయ్యారు. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

అక్రమాలకు తావివ్వొద్దు

కనగానపల్లి: ఉపాధిహామీ పథకంలో అవినీతి, అక్రమాలకు తావివ్వకుండా కూలీలకు సక్రమంగా పనులు కల్పించాలని సీఆర్‌డీపీ స్టేట్ మానిటరింగ్ అధికారి సత్యనారాయణ తెలిపారు. సోమవారం దాదులూరులో సీఆర్‌డీపీ అధికారులు ఉపాధి హామీ పనులు పరిశీలించారు. గ్రామంలోని ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బందిపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపట్టారు.

బళ్లారికి పీసీపీఎన్‌డీటీ బృందం

అనంతపురం క్రైం: కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆదేశాలతో జిల్లా పీసీపీఎన్‌డీటీ యాక్ట్ నోడల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ఓ బృందం మంగళవారం బళ్లారికి వెళ్లనుంది. జిల్లా సరిహద్దుల్లో జరుగుతున్న మాతా, శిశు మరణాలను అరికట్టడంలో భాగంగా కర్ణాటక వైద్యాధికారులతో పీసీపీఎన్‌డీటీ యాక్ట్ జిల్లా నోడల్ ఆఫీసర్, డెమో ఉమాపతి, డిప్యూటీ డెమో త్యాగరాజులు సమావేశం కానున్నారు.

భక్తిశ్రద్ధలతో సాయి భిక్షాటన



రథంపై దర్శనమిచ్చిన సాయినాథుడు





రథం ముందు లయబద్ధంగా ఆడుతున్న అశ్వాలు

అనంతపురం కల్చరల్: నగరంలో వచ్చేనెల 3న జరుగనున్న గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా భారీ ఎత్తున సాయి భిక్షాటన జరిగింది. సోమవారం పాతూరు, టవర్‌క్లాక్, కమలానగర్, సప్తగిరి సర్కిల్ తదితర చోట్ల వందలాది మంది సాయి భక్తులు జోలె పట్టి భిక్ష సేకరించారు. షిర్డీ సాయి అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో షిర్డీ క్షేత్రం నుంచి వచ్చిన గుర్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నగర వీధుల్లో అవి చేసిన విన్యాసాలు, నాట్యాలను భక్తులు ఆసక్తిగా తిలకించారు. వెండిరథంపై షిర్డీ సాయి నాథుడు పురవీధుల్లో ఊరేగుతూ దర్శనమిచ్చారు. అడుగడుగునా భక్తులు హారతులు పట్టి కానుకలను సమర్పించారు. స్థానిక వేణుగోపాల నగర్‌లోని షిర్డీసాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

మీ ఆశీర్వాదం కావాలి తల్లీ..

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాదురూరల్: గతంలో ఎన్నో ప్రభుత్వాలు చూశారు.. నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.లక్షలు లబ్ధి చేకూరిందా.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు వర్తిస్తున్నాయని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఇంతటి మేలు చేసిన ముఖ్యమంత్రిని గతంలో ఎప్పుడైనా చూశారా తల్లీ..అలాంటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మీ ఆశీర్వాదం కావాలి' అంటూ ప్రతి ఇంటా ఎమ్మెల్యే అడిగారు. సోమవారం అనంతపురం రూరల్ మండలం విద్యారణ్యనగర్‌లో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులతో ఇంటింటికీ తిరిగిన ఎమ్మెల్యే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతో కలిగిన లబ్ధిని వివరించారు. ప్రతి గడపలోనూ ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్‌కు ఘన స్వాగతం పలికారు.

అక్కా..బాగున్నారా?..

ప్రతి ఇంటికీ వెళ్లి మిమ్మల్ని కలిసి రావాలంటూ జగనన్న చెప్పారని ఎమ్మెల్యే తెలపగా మహిళలు ఆనందపడ్డారు. స్థానిక సమస్యలను తెలుసుకుంటూ వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుజ్జల వరలక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ తాటిచెర్ల నాగేశ్వర రెడ్డి, నాయకులు ధనుంజయయాదవ్, బీజీ గోపాల్ రెడ్డి, జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఓబుగారి హరినాథరెడ్డి, మండల కన్వీనర్ మతం శ్యాందసుదర్, పార్టీ మండల కన్వీనర్ బండి పవన్, ఎంపీటీసీ సభ్యులు వెంకటేశ్వర్లు, సందీప్‌యాదవ్, మౌనిక, స్థానిక నాయకులు మాదన్నయాదవ్, టి.గోపాల్ రెడ్డి, మునిశంకరయ్య, బయపరెడ్డి, రాజగోపాల్, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.



వృద్ధురాలికి బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి.చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న ఆంజనేయులుగౌడ్

అనంతపురం క్రైం: రూరల్ డెవలప్‌మెంట్ వ్యవస్థాపకులు (ఆర్డీటీ) ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ వర్ధంతిని పురస్కరించుకొని సాయి ట్రస్టు ఆధ్వర్యంలో సర్వజనాస్పత్రి, కేన్సర్ ఆస్పత్రి, అమ్మఒడి వృద్ధాశ్రమంలో సోమవారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో సాయిట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ విజయ్‌కుమార్, సభ్యులు రాఘవ, నారాయణనాయకల్ తదితరులు పాల్గొన్నారు.

లిటిల్ ఫ్లవర్ స్కూల్ ఆధ్వర్యంలో..

రాప్తాదురూరల్: నగరంలోని లిటిల్‌ఫ్లవర్ స్కూల్ ఆధ్వర్యంలో ఫాదర్ ఫెర్రర్ వర్ధంతి సందర్భంగా సోమవారం అన్నదానం చేశారు. ముందుగా కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో లిటిల్ ఫ్లవర్ విద్యా సంస్థల స్పెషల్ ఆఫీసర్ శివారెడ్డి, ఏఓ పూజారి ఈరన్న, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు సోమవారం నిర్వహించారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధికార ప్రతినిధి పులిరాజు మాట్లాడుతూ దేశంలో వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గ్రహించి రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు 150 రోజులు సుదీర్ఘ భారత్ జోడో యాత్రను చేపట్టారన్నారు. మోదీ దేశ సంపదను అదానీ, అంబానీకి దోచిపెడుతున్నారని ఎద్దేవా చేశారు.నాయకులు హరికృష్ణ, ప్రదీప్, సురేష్, ముని. వీరా, రంజిత్, గంగరాజు, విక్రం, విష్ణు, నాగేంద్ర పాల్గొన్నారు.

- రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని అమ్మ ఒడి వృద్ధాశ్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు పండ్లు, బియ్యం పంపిణీ చేశారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర వర్సిటీ కన్వీనర్ యనుమల ప్రసాద్, లక్ష్మన్న, జి. మారెన్న, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ కోసం అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు

అనంతపురం టౌన్: నగర ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు విద్యుత్ సబ్‌స్టేషన్లలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ రమేష్ తెలిపారు. నగరంలోని ఆరు సబ్‌స్టేషన్ల నుంచి వివిధ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో అధిక లోడ్‌తో తరచూ అంతరాయం ఏర్పడుతుండడంతో విద్యుత్ శాఖ ప్రత్యేక కార్యచరణ చేపట్టిందన్నారు. సబ్‌స్టేషన్లకు అదనపు ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఒక్కో విద్యుత్ సబ్ స్టేషన్‌కు రూ.50 లక్షలతో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌లో అదనపు పవర్ ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నగరంలో తొలివిడతగా హెచ్ఎల్సీ కాలనీలోని సబ్ స్టేషన్‌లో అదనపు ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు పనులు వేగవంతంగా చేపట్టినట్లు తెలిపారు. బుధవారం అదనపు ట్రాన్స్ ఫార్మర్లను ప్రారంభించనున్నట్లు తెలిపారు. దీంతో ఆర్కేనగర్, శ్రీ శ్రీ కాలనీ, హెచ్ఎల్సీ కాలనీతోపాటు రామచంద్రానగర్ తదితర ప్రాంతాల ప్రజలకు లోఓల్టేజీ సమస్య ఉండదు.

మెనూ సక్రమంగా అమలు చేయండి

- సాంఘిక సంక్షేమశాఖ జేడీ మధుసూదన్‌రావు

అనంతపురం రూరల్: ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడానికి నూతన మెనూను అమలు చేస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్‌రావు తెలిపారు. సోమవారం ఆయన నగరంలోని పలు సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించడానికి ప్రభుత్వం కొత్త మెనూ అమలు చేస్తోందన్నారు. కొత్త మెనూను అమలు చేయడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు రోజూ తప్పకుండా బయోమెట్రిక్ నమోదు చేయాలన్నారు. వార్డెన్లు విద్యార్థులకు, వార్డెన్లు అందుబాటులో ఉండాలన్నారు. విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.



బయోమెట్రిక్ నమోదును పరిశీలిస్తున్న సాంఘిక సంక్షేమశాఖ జేడీ మధుసూదన్‌రావు

అండర్-19 క్రికెట్ జట్టు ఎంపిక

అనంతపురం: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా అండర్-19 జట్టు ఎంపిక ప్రక్రియ సోమవారం ముగిసింది. ఈ మేరకు అసోసియేషన్ కార్యదర్శి మధు ఆచారి తెలిపారు. ఎంపికైన వారిలో అర్జున్ టెండూల్కర్ , వీరారెడ్డి, ప్రశాంత్, వెంకట లోకేష్, మణిదీప్, విఘ్నేష్ దినకర్, ప్రదీప్‌రెడ్డి, జయంత్ కృష్ణ, కౌశిక్, తన్వీనర్ జమాల్, లీలాసాయి, రెహన్, సాహిల్, చంద్రశేఖర్, లోహిత్‌సాయి, కరీం బాబా, మనోజ్, కె.భార్గవ్, హర్షవర్ధన్, బి.భార్గవ్ ఉన్నారు. రిజర్వ్‌డ్‌కు రూపేష్, నవీన్, శంకర్ నారాయణ, సుమీత్, సాయిప్రణీత్ ఎంపికయ్యారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురంఅర్బన్: చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పామిశెట్టి గోవింద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు నీలూరి రుషింగప్ప మాట్లాడారు. మగ్గాలున్న చేనేత కార్మికులకు ప్రభుత్వం నేతన్న నేస్తం పథకం కింద ఏడాదికి రూ.24 వేలు ఆర్థిక సహాయం చేస్తున్నందుకు ధన్యావాదాలు తెలుపుతునామన్నారు. ఈ పథకాన్ని నేతన్నలందరికీ వర్తించేలా చూడాలని కోరారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. చేనేత వస్త్రాల రసాయనాలు, జరీపై పూర్తిగా జీఎస్టీని కేంద్రం రద్దు చేయాలన్నారు. 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలన్నారు. ఉల్లంఘించిన వారిపై చట్టం (1985) ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. మాస్టర్ వీవర్స్ వద్ద నిలువ ఉన్న చేనేత వస్త్రాలను ప్రభుత్వం కొనుగోలు చేసి, వలంటీర్ వ్యవస్థ ద్వారా మార్కెటింగ్ సదుపాయం కల్పించాలన్నారు. అనంతరం కలెక్టర్ గౌతమికి వినతి పత్రాన్ని నాయకులు అందజేసి, తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, ఉప ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, నాయకులు లింగమయ్య, కృష్ణుడు, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న ఏపీ చేనేత కార్మిక సంఘం, సీపీఐ నాయకులు